మహిమాన్వితుడు మహాత్మ బడేసాహెబ్

- గండిహాళ్లిలోని దర్గాను దర్శించుకుంటే ఆయురారోగ్యాలు
- స్వామి ఆశీస్సులతో కోర్కెలు నెరవేరుతాయని భక్తుల విశ్వాసం
- కులమతాలకు అతీతంగా దర్గాలో ఫాతెహాలు
- 5వ తేదీ నుంచి స్వామివారి 331వ ఉరుసు


దర్గా ముఖద్వారం


బడేసాహెబ్‌స్వామివారి సమాధి

గోనెగండ్ల: భక్తుల పాలిట కొంగు బంగారమై గంజిహళ్లి మహాత్మ బడేసాహెబ్‌స్వామి వారి దర్గా మండల పరిధిలోని గంజిహళ్లి గ్రామంలో వెలుగొందుతోంది. కొన్ని వందల సంవత్సరాలుగా దివ్యక్షేత్రంగా వెలుగొందుతూ కులమతాలకు అతీతంగా ఈ దర్గాలో ఫాతెహాలు నిర్వహిస్తున్నారు. దర్గాకు ధర్మకర్తలు కూడా హిందువులే ఉండటం విశేషం. స్వామివారి ఉరుసు మహోత్సవాలు ఈనెల 5వ తేదీ నుంచి ప్రారంభంకానున్నాయి.

పుట్టుకతోనే దైవాంశ సంభూతుడు..

మూడు శతాబ్దాల క్రితం మహాత్మ బడేసాహెబ్‌స్వామి వారు గ్రామంలో వెలిశారు. ఆయన పుట్టుకతోనే దైవాంశ సంభూతుడని, చిన్నవయస్సు నుండే నమ్మశక్యం కాని మహిమలు చూపించేవారని భక్తులు పేర్కొంటారు. దర్గాను దర్శించుకుంటే ఆయురారోగ్యాలతోపాటు అనుకున్నవన్ని జరుగుతాయని భక్తులు విశ్వసిస్తారు. స్వామివారు అప్పట్లో తాను ఉన్న చోట నుంచే ప్రముఖ పుణ్యక్షేత్రాలను భక్తులకు చూపించేవారని, చిన్న వయస్సులో అనేక మహిమలు చూపించిన అత్యంత మహిమాన్వితుడని గ్రామస్తులు చెబుతారు.

5న గంధం వేడుక.. :స్వామివారి 331వ ఉరుసు మహోత్సవాలు ఈనెల 5వ తేదీ నేటి నుంచి 7వ తేది వరకు అత్యంత వైభవంగా జరుగనున్నాయి. 5న స్వామివారి గంధం, 6న గురువారం ఉరుసు, 7న శుక్రవారం జియారత్ కార్యక్రమాలు జరుగుతాయి.

ఏర్పాట్లు పూర్తి..

ఉరుసు మహోత్సవాలకు ఏటా రాష్ట్రం నుంచే కాక ఇతర రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు తరలి వస్తారు.

ఈసందర్భంగా గ్రామంలో, దర్గాలో భక్తులకు కావాల్సిన సౌకర్యాలు దర్గా కమిటీ వారు ఏర్పాటు చేస్తున్నారు. ఉరుసు మహోత్సవంలో భక్తులు తమ మొక్కులు తీర్చుకునేందుకు లక్ష మందికి పైగా వస్తారని అంచనా. ఇందుకు అనుగుణంగా దర్గా ఆవరణలో క్యూలైన్లను ఏర్పాటు చేస్తున్నట్లు దర్గా కమిటీ సభ్యులు తెలిపారు. అలాగే గ్రామంలో వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తుండగా గ్రామ పంచాయతీ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు మంచినీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ఆయా శాఖల అధికారులు తెలిపారు.

అలాగే గ్రామానికి భక్తులు వచ్చేందుకుగాను ఎమ్మిగనూరు, గోనెగండ్ల నుంచి ఎమ్మిగనూరు ఆర్టీసీ డిపో వారు అధిక సంఖ్యలో బస్సులను నడిపేందుకు చర్యలు తీసుకున్నారు.

భక్తులకు ఇబ్బంది లేకుండా చూస్తున్నాం



గ్రామంలో జరిగే మహత్మ బడేసాహెబ్‌స్వామివారి ఉరుసు మహోత్సవం సందర్భంగా దర్గాలో ముజావర్లతో కలిసి భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. దర్గాలో మంచినీటి సమస్య కూడా లేకుండా చూస్తున్నాం. లక్షల సంఖ్యలో దర్గాకు రానుండడంతో కమిటీ వారికి భక్తులు సహకరించాలి.

– ఆర్‌వీ కుబేర్ రెడ్డి, దర్గా ధర్మకర్త, గంజిహళ్లి

గట్టి పోలీసు బందోబస్తు

ఉరుసు మహోత్సవం సందర్భంగా గ్రామంలో ఎమ్మిగనూరు డీఎస్పీ ఉపేంద్ర నేతృత్వంలో గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నాం. ఉరుసుకు వచ్చే భారీ వాహనాలు గ్రామం బయట కేటాయించిన స్థలంలోనే నిలిపేలా చర్యలు తీసుకుంటున్నాం. ఉరుసు సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఎక్కువ సంఖ్యలో పోలీసులను బందోబస్తు నిమిత్తం నియమిస్తున్నాం.

– గంగాధర్, సీఐ, గోనెగండ్ల

క్లుప్తంగా

రైతులూ రిజిస్ట్రేషన్ చేసుకోండి


ఏడీఏ మహమ్మద్‌ఖాద్రీ

ఎమ్మిగనూరురూరల్: ప్రతి రైతు ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్య కోసం రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఏడీఏ మహమ్మద్‌ఖాద్రీ సూచించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలో భూమి ఉన్న ప్రతి రైతు గుర్తింపు సంఖ్యను తీసుకోవాలన్నారు. ఇప్పటి వరకు ఎమ్మిగనూరు మండలంలో 10,328 మంది రైతులు, గోనెగండ్ల మండలంలో 11,101 మంది, నందవరం మండలంలో 10,528 మంది, మంత్రాలయం మండలంలో 7,501 మంది రైతులు తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు తెలిపారు. మిగతా రైతులు గ్రామాల్లో రైతు సేవా కేంద్రాలకు వెళ్లి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు.

ట్రాఫిక్ రూల్స్ పాటించాలి


ప్రజలకు ట్రాఫిక్ రూల్స్‌ను వివరిస్తున్న ట్రాఫిక్ సీఐ గంటా సుబ్బారావు

ఆదోని అర్బన్: ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా ట్రాఫిక్ రూల్స్ పాటించాలని ట్రాఫిక్ సీఐ గంటా సుబ్బారావు సూచించారు. ఆదివారం పట్టణంలో పోలీస్ కంట్రోల్ రూమ్ వద్ద ప్రజలకు ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కల్పించారు. మోటార్ వాహన చట్టం 1988, అమెండ్‌మెంట్ 2019 ప్రకారం ట్రాఫిక్ రూల్స్ పాటించని వారికి పెంచిన జరిమానాలను తెలియజేశారు. వాహనదారులందరూ తప్పనిసరిగా ట్రాఫిక్ నియమ, నిబంధనలు పాటించాలన్నారు. ట్రాఫిక్స్ రూల్స్ పాటించని వారిపై జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. ట్రాఫిక్స్ రూల్స్ పాటించడం వల్ల అమూల్యమైన ప్రాణాలను కాపాడుకోవడంతో పాటు ప్రమాదాలను నివారించవచ్చన్నారు.

చలో విజయవాడను జయప్రదం చేయండి


మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అంజిబాబు

ఆదోని రూరల్: ఆశావర్కర్లకు కనీస వేతనం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఈనెల 6వ తేదీన చేపట్టే చలో విజయవాడ మహాధర్నాను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.డి.అంజిబాబు, కార్యదర్శి నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం స్థానిక రెవెన్యూ భవన్‌లో ఆశావర్కర్ల జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ 2024 సంవత్సరంలో రాష్ట్ర నాయకత్వంతో రాష్ట్ర అధికారులు జరిపిన చర్చల్లో చేసుకున్న ఒప్పందాలకు సంవత్సరం అవుతున్నా వాటిని అమలు చేయకుండా కాలయాపన చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం కంటే మేము ఆశా వర్కర్లకు మా ప్రభుత్వం వస్తే మేలు చేస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం తొమ్మిది నెలైనా కనీస వేతనం నెలకు రూ.26 వేలు ఇవ్వకుండా కాలయాపన చేస్తుందన్నారు. సమావేశంలో ఆశా వర్కర్ల సంఘం నాయకురాళ్లు జయలక్ష్మి, రాజేశ్వరి, సుహాసిని, లావణ్య, నాగవేణి, సుకన్య తదితరులు పాల్గొన్నారు.

నేడు, రేపు కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు

కోసిగి: స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో సోమ, మంగళవారాల్లో బీసీ కార్పొరేషన్ సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వెంకటేశ్వర్లు తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కోసిగి మండలానికి 50 యూనిట్స్‌కు రూ.94,50,000 రుణాలు కేటాయించినట్లు తెలిపారు. ఇందుకు గానూ మండలంలోని 526 దరఖాస్తులు వచ్చాయన్నారు. 4వ తేదీన ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్, కెనరా బ్యాంక్‌కు దరఖాస్తు వారికి ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు. అభ్యర్థులు ఒరిజనల్ పత్రాలతో హాజరు కావాలని సూచించారు. ఉదయం 10గంటల నుంచి ఇంటర్వ్యూలు ప్రారంభమవుతాయని తెలిపారు.

మాళమల్లేశ్వరస్వామికి విశేష పూజలు


మాళమల్లేశ్వరస్వామికి పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

హొళగుంద: దేవరగట్టు మాళ మల్లేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం విశేష పూజలు జరిగాయి. స్థానికులే కాకుండా కర్ణాటక నుంచి భక్తులు తరలి వచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. అంతకు ముందు పూజారులు స్వామి వారి మూలవిరాట్‌కు సుప్రభాత సేవ, జలాభిషేకం, బండారార్చన, కుంకుమార్చన, మహామంగళ హారతి తదితర పూజలు చేపట్టారు.

సార్ కరెంటు పోకుండా చూడండి


మాట్లాడుతున్న సీఐ అశోక్‌కుమార్

కౌతాళం: సార్.. తమకు కరెంటు కష్టాలు లేకుండా చూడాలని కస్తూర్బా పాఠశాలలో విద్యార్థినులు సీఐ అశోక్‌కుమార్‌ను కోరారు. స్థానిక కస్తూర్బా పాఠశాలలో ఆదివారం ముందస్తు మహిళా దినోత్సవ వేడుకలను చేపట్టారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీఐ హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థినులు తమ సమస్యలను సీఐకు విన్నవించారు. ప్రస్తుతం ఇంటర్ పరీక్షలు జరుగుతున్నాయని మరో 15రోజుల్లో పదో తరగతి పరీక్షలు ప్రారంభం అవుతాయని, ఇలాంటి సమయంలో నిత్యం కరెంటు సరఫరాలో అంతరాయం ఏర్పడుతోందని ఆయన దృష్టికి తెచ్చారు. ట్రాన్స్‌కో ఏఈతో మాట్లాడి సమస్యను పరిష్కారిద్దామని సీఐ సమాధానమిచ్చారు. ప్రతి విద్యార్థిని ఉన్నత స్థానానికి వెళ్లడానికి కృషి చేయాలని దానికి కోసం కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే భారీ జరిమానా


మాట్లాడుతున్న సీఐ గంగాధర్

గోనెగండ్ల : మోటార్ వాహన చట్టంలో జరిమానాలు భారీగా పెరిగాయి కాబట్టి వాహనదారులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని సీఐ గంగాధర్ తెలిపారు. ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 1నుంచి నూతన మోటార్ వాహన చట్టం ప్రకారం పెరిగిన జరిమానాలు అమలులోకి వస్తాయన్నారు. వాహన చట్టంలో పొందుపరిచిన నియమాలను అతిక్రమించినటో పెరిగిన జరిమానాలు విధించక తప్పదని హెచ్చరించారు. లైసెన్స్ లేని వ్యక్తికి వాహనం ఇస్తే జరిమానా రూ.5వేలు, లైసెన్స్ లేకుండా వాహనం నడపడితే రూ.5వేలు, అతివేగంగా వాహనాలను నడపితే చిన్న వాహనాలకు రూ.వెయ్యి, పెద్ద వాహనాలకు రూ.2వేలు, ప్రమాదకరంగా వాహనాన్ని నడిపితే మొదటిసారి రూ.2వేలు, రెండవ సారి రూ.10వేలు, రిజిస్ట్రేషన్ లేదా ఫిట్నెస్ లేని వాహనాలు నడిపితే మొదటిసారి రూ.5వేలు, రెండవసారి రూ.8వేలు జరిమానా ఉంటుందన్నారు. వాహనాలతో రేసింగ్ చేస్తే మొదటిసారి రూ.5వేలు, రెండవ సారి రూ.10వేలు, సీటు బెల్ట్ ధరించకపోతే రూ.వెయ్యి, హెల్మెట్ ధరించకపోతే రూ.వెయ్యి, సైలెన్సర్ మార్చి పెద్ద పెద్ద శబ్దాలు చేస్తూ వాహనాన్ని నడిపితే మొదటిసారి రూ.వెయ్యి, రెండవసారి రూ.2వేలు, ఇన్సూరెన్స్ లేని వాహనాలు నడపితే మొదటిసారి రూ.2వేలు, రెండవసారి రూ.4వేలు చొప్పున జరిమానాలు విధించడం జరుగుతుందని చెప్పారు.

రైతుల సంక్షేమం కోసం పోరాటాలు

మద్దికెర : రైతుల హక్కుల సాధన కోసం పోరాటాలు చేస్తామని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామచంద్రయ్య అన్నారు. ఆదివారం మండలంలోని పెరవలి గ్రామంలో రైతు సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభించారు. రైతు సమస్యలతో పాటు ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు చేస్తున్నామని చెప్పారు. ప్రభుత్వాలు రైతు సంక్షేమం పట్ల నిర్లక్ష్యం విడాలన్నారు. సీపీఐ మండల కార్యదర్శి నాగరాజు, రైతు సంఘం నాయకులు కోదండరాముడు, నాగిరెడ్డి పాల్గొన్నారు.

ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌కు ప్రహరీ ఏర్పాటు


హాస్టల్‌లోకి ఇతరులు వెళ్లకుండా ప్రధాన గేటు ఏర్పాటు చేసిన పంచాయతీ సిబ్బంది

కోసిగి: మండల కేంద్రం కోసిగిలోని ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌లో భద్రత ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టారు. ఇటీవల జిల్లా ఉన్నత అధికారులు పర్యటించి విద్యార్థులకు సరైన వసతులు లేక పోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉన్నత ఆదేశాల మేరకు గ్రామ సర్పంచ్ అయ్యమ్మ, పంచాయతీ ఈఓ తిరుమలేశ్వర రెడ్డి గ్రామ పంచాయతీ నిధులతో భద్రత ఏర్పాటు పనులు ముమ్మరంగా చేపట్టారు. గతంలో హాస్టల్‌కు భద్రత లేకుండా బయటి వ్యక్తులు లోపలికి ప్రవేశించి మందు తాగడం, ఆకతాయిలకు అడ్డుగా ఉండేది. అలాగే రాత్రిల్లో సమీప కాలనీ వాసులు బహిర్భూమి ప్రదేశంగా మారిపోయి విద్యార్థులు దుర్వాసనల మధ్య చదువులు సాగించలేక అవస్థలు పడ్డారు. ఈ తరుణంలో జిల్లా ఉన్నత అధికారులు పర్యవేక్షించి హాస్టల్ విద్యార్థుల సమస్యల పరిష్కారానికి శ్రీకారం చుట్టారు. స్థానికులు హాస్టల్‌లో ప్రవేశించకుండా, సమీప కాలనీ వాసులు లోపలికి రాకుండా గోడకు కట్టేశారు. ప్రధాన గేటును ఏర్పాటు చేసి పకడ్బందీగా చర్యలు చేపట్టారు. దీంతో విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు. అలాగే హాస్టల్ ప్రాంగణంలో ఉన్న డంపింగ్ యార్డును తొలగించాలని, డ్రైనేజీ నీళ్లు హాస్టల్ ప్రాంగణంలో నిల్వ ఉండకుండా దూరపు ప్రాంతాలలో తరలించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రైతులకు కూటమి ప్రభుత్వం వెన్నుపోటు


రవిచంద్రరెడ్డి

పెద్దకడబూరు : కూటమి ప్రభుత్వం రైతులకు వెన్నుపోటు పొడిచిందని వైఎస్సార్‌సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు రవిచంద్రరెడ్డి అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం 2024 – 25 సంవత్సరం రైతు భరోసాకు ఎగనామం పెట్టారన్నారు. ధరల స్థిరీకరణకు కేవలం రూ. 300కోట్లు కేటాయించడం బాధాకరమన్నారు. రాయలసీమ ప్రాంత రైతులను కూటమి ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని, సీమలో పెండింగ్ ప్రాజెక్టులకు బడ్జెట్‌లో ఎటువంటి కేటాయింపులు లేకపోవడం మోసం చేయడమేనన్నారు. కూటమి ప్రభుత్వ వాగ్దానాలు నష్టపోతున్న మిర్చి రైతులకు ఎటువంటి ఉపయోగం లేకుండా కేవలం ప్రకటనలకే పరిమితం అయ్యాయన్నారు. జిల్లాలో మిర్చి కొనుగోలు చేయడానికి మార్కెట్‌ను అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు.

బైక్ అదుపుతప్పి ఇద్దరికి గాయాలు

ఆలూరు రూరల్: మండలంలోని అరికెర గురుకుల పాఠశాల సమీపంలో ఆదివారం ఉదయం బైక్ అదుపుతప్పి కిందపడి ఇద్దరు యువకులు గాయపడ్డారు. బంధువులు తెలిపిన వివరాలు.. హాలహర్వి మండలం గూళ్యం గ్రామానికి చెందిన పంపాపతి,రాజు ఉదయం పని నిమిత్తం స్కూటర్‌పై ఆలూరుకు వచ్చారు. తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా అరికెర గురుకుల పాఠశాల సమీపంలో బైక్ అదుపుతప్పి పొలాల్లోకి దూసుకెళ్లింది. పంపాపతి తలకు తీవ్రగాయాలు కాగా.. రాజు స్వల్పంగా గాయపడ్డాడు. అటువైపుగా వెళ్తున్న ప్రయాణికులు గమనించి 108 అంబులెన్స్‌కు సమాచారం అందించి చికిత్స కోసం ఆలూరు ఆసుపత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన పంపాపతిని మెరుగైన వైద్యం కోసం బళ్లారి ప్రభుత్వ ఆసుపత్రికి రెఫర్ చేశారు.

ఘనంగా రాఘవేంద్ర స్వామి ప్రభోత్సవం


పూజలందుకుంటున్న స్వామివారు


ప్రభ వద్ద పూజలు చేస్తున్న భక్తులు

కోసిగి: మండల పరిధిలోని అగసనూరు గ్రామంలో తంగభద్ర నది ఒడ్డున వెలసిన జగద్గురు గురు రాఘవేంద్ర స్వామి ప్రభోత్సవం భక్తుల మధ్య కమనీయంగా సాగింది. ఆదివారం గురురాఘవేంద్ర స్వామి సప్త వారోత్సవాల్లో భాగంగా ఉత్తరాధనను పురస్కరించుకుని ఆలయ అర్చకులు పూజారి వెంకటేష్ స్వామి ఆధ్వర్యంలో వేకువ జాము నుంచి సుప్రభాత సేవతో ఉత్సవాలకు అంకురార్పణ పలికారు. ఆలయంలో స్వామి వారికి అభిషేకాలు, మహామంగళ హారతులు గావించి ప్రత్యేక పూజలు చేపట్టారు. ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలను పల్లకీలో కొలువుంచి తుంగభద్ర నది వరకు మేళతాళాలతో పురవీధుల గుండా ఊరేగింపుగా తీసుకెళ్లి అక్కడ పూజలు చేసి ప్రభ చెంతకు తీసుకొచ్చారు. అనంతరం ఉత్సవమూర్తిని ప్రభ పై కొలువుంచి స్వామి వారి పాదాల వరకు లాగి తిరిగి యథా స్థానానికి చేర్చారు. భక్తులు పాల్గొని స్వామి వారిని దర్శించుకుని పూజలు చేసుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

పోసాని కృష్ణమురళి అక్రమ అరెస్టు తగదు


ఎస్.గోపాల్‌రెడ్డి

ఆదోని టౌన్: నటుడు, రచయిత, నిర్మాత పోసాని కృష్ణమురళిని అక్రమ కేసులో ఇరికించి అరెస్టు చేయడం తగదని వైఎస్సార్‌సీపీ కర్నూలు జిల్లా సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు ఎస్.గోపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 67 ఏళ్ల వయస్సులో గుండె, కడుపు నొప్పితో బాధపడుతున్న పోసాని కృష్ణమురళిపై కుట్రపూరితంగా కేసులు నమోదు చేసి కూటమి ప్రభుత్వం హింసిస్తోందన్నారు. ఆయన కిడ్నీలో నాలుగు ఎంఎం రాయి ఉన్నట్లు అల్ట్రాసౌండ్ స్కానింగ్ పరీక్షలో తేలిందన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో రైల్వే కోడూరు రూరల్ సీఐ వెంకటేశ్వర్లు పోసాని కృష్ణమురళికి ఎలాంటి అనారోగ్య సమస్యలు లేవని, నాటకాలు ఆడుతున్నారని చెప్పడం దారుణమన్నారు. రాష్ట్రంలో రెడ్‌బుక్ పాలన సాగుతుందనడానికి ఇదొక నిదర్శనమన్నారు. ప్రజలు ప్రభుత్వంపై తిరగబడే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు.

ప్రారంభమైన రంజాన్ ఉపవాస దీక్షలు


కౌతాళంలో ఉపవాస దీక్షను విరమిస్తున్న ముస్లింలు

కౌతాళం: రంజాన్ మాస ఉపవాస దీక్షలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా ఆదివారం మొదటి రోజు మండలంలోని ఆయా మసీదుల్లో వెంట తెచ్చుకున్న పండ్లు, ఫలహారాలతో ఉపవాస దీక్షను విరమించారు. ఖురాన్ అవతరించిన నెల కావడంతో రంజాన్ నెలకు ప్రాధాన్యత. ప్రతి ముస్లిం ఈనెలలో 30 రోజుల పాటు ఉపవాసం ఉండి భక్తిశ్రద్ధలతో నమాజులు చేయడంతో పాటు రాత్రి పూట ప్రత్యేక తరావీ నమాజును ఆచరించడం ముఖ్యవిధి. యవస్సు వారి నుంచి నమాజుకు, ఉపవాస దీక్షలకు అర్హులని మదీన మజీద్ మౌలానా అక్బర్, ఖాదర్‌లింగస్వామి దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నాపాషా చిష్తీ తెలిపారు. తాము సంపాదించిన మొత్తంలో రెండున్నర శాతంను జకాత్ రూపంలో పేదలకు దానం చేయాలని, అలాగే ఫిత్రా కింద ఇంట్లో ఉన్న పిల్లవాని నుంచి, ప్రతి వ్యక్తికి 100 రూపాయలు కాని లేక రెండున్నార కేజీల గోధుమలను ధానంగా ఇవ్వాలని తెలిపారు. ఇప్పటికే కౌతాళంలోని జామియ మజీద్, నూరానీ మజీద్, అక్సా మజీద్, దర్గాలోని ఖాద్రియా మజీద్, మదీన మజీద్‌లతో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్న మజీదులకు రంగులతో, విద్యుత్ దీపాలతో అలంకరిస్తున్నారు.

నేటి నుంచి ఓబులేసుడి ఉత్సవాలు

ఆస్పరి: మండలంలోని తొగలుగల్లులో సోమవారం నుంచి బుధవారం వరకు ఓబులేసు స్వామి, ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి ఉత్సవాలు నిర్వహించునున్నట్లు గ్రామ పెద్దలు ఆదివారం తెలిపారు. సోమవారం గ్రామ దేవతలకు, స్వామి వారికి అభిషేకం, కలశ, పల్లకీ సేవ, మంగళవారం ఆలయంలో స్వామి, అమ్మవార్లకు గంగపూజ, పంచామృతాభిషేకం, మంగళహారతులు, స్వామి వారి కల్యాణోత్సవం, బుధవారం ప్రభోత్సవం, బుక్కపిండి సేవ, నుగ్గులాట, వసంతోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయని వివరించారు.

తుంగాతీరంలో జాతర సందడి


తుంగభద్ర నదిలో స్నానాలు ఆచరిస్తున్న భక్తులు


గాజులు కొనుగోలు చేస్తున్న మహిళలు


మిఠాయిలు కొనుగోలు చేస్తున్న దృశ్యం


జంపింగ్ నెట్‌లో పిల్లల సందడి

నందవరం : దక్షిణ కాశీగా పేరు గాంచిన గురజాల రామలింగేశ్వరుడి జాతరలో భాగంగా ఐదవ రోజు ఆదివారం భక్తుల సందడి నెలకొంది. తుంగభద్ర నదిలో పుణ్యస్నానాలు ఆచరించి భక్తులు ఆది దంపతులు (రామలింగేశ్వరుడు, పార్వతీ దేవి)ని దర్శించుకున్నారు. భక్తులు, గ్రామస్తులతో దుకాణాల వద్ద సందడి కనిపించింది. జాతరలో గాజుల దుకాణం, చిన్నారుల బొమ్మలు, రంగుల రాట్నం, నేతి మిఠాయి, చిన్నారుల కోసం ఏర్పాటు చేసిన జంపింగ్, కారు వీల్ చక్రం ఆకర్షణీయంగా నిలిచాయి. చిన్నారులు జంపింగ్ నెట్, డ్రాగన్ ఊయలలు, కారు వీల్ చక్రాలు తిరుగుతూ కేరింతలతో ఆనందపడ్డారు. జాతరలో నేతి మిఠాయిలు, బురుగులు, తినుబండారాలను ప్రజలు కొనుగోలు చేశారు.

నిరాశపరిచిన రాష్ట్ర బడ్జెట్


మాట్లాడుతున్న ఎస్టీయూ జిల్లా కార్యదర్శి గోపాల్

ఆదోని సెంట్రల్: రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశ పెట్టిన బడ్జెట్ ఉద్యోగ, ఉపాధ్యాయులను నిరాశపరిచిందని ఎస్టీయూ జిల్లా కార్యదర్శి గోపాల్ అన్నారు. ఎస్టీయూ భవన్‌లో ఎస్టీయూ ప్రధాన కార్యదర్శి సుధాకర్ బాబు అధ్యక్షతన ఆదోని కౌతాళం మండలాల ముఖ్య నాయకుల సమావేశం ఆదివారం జరిగింది. వారు మాట్లాడుతూ పీఆర్సీలకు సంబంధించి ఎటువంటి కేటాయింపులు చేయకపోవడం ఉద్యోగ వర్గానికి తీవ్ర నిరాశకు గురి చేసిందన్నారు. ప్రభుత్వం ఏర్పడి ఎనిమిది నెలలు కావస్తున్నా ఒక డీఏ కూడా ప్రకటించక పోవడం బాధాకరమన్నారు. పీఆర్సీ కేటాయింపుకు కమిషన్ వేసి పెండింగ్లో ఉన్న డీఎలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎస్టీయూ అదనపు ప్రధాన కార్యదర్శి సుంకన్న మాట్లాడుతూ ఉపాధ్యాయుల బదిలీలకు ప్రత్యేక చట్టం తీసుకురావడం సంతోషకరమన్నారు. అయితే సర్వీస్ పాయింట్లను ఒక పాయింట్‌గా కేటాయించడం సబబు కాదని, దానిని 0.5గా కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు రామకృష్ణ, అంజినయ్య, భాస్కర్, వెంకటేశ్వర్లు, కోటేశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.